# బ్రతుకు తీపి

ప్రకాశం పార్కు దగ్గిర రోడ్డువార రావి చెట్టుకింద కూచున్నాడు హస్త సాముద్రికుడు. ఆ ప్రక్కనే అఖండ వైతరదీలా మురుగుకాలవ, ఎదురుగా కాళీస్థలంలో సర్కస్ డేరాలున్నాయి.

సాయంత్రం అయిదు గంటలవేళ ఎండ తీక్షణత యింకా తగ్గలేదు. మేటినీ సినిమా వదలి పెట్టారు, ఇటు క్రిష్ణా సినిమానుంచి వచ్చేజనం, అటు న్యూపూర్ణానుంచి వచ్చేజనం. ఆమీద లక్ష్మీసరస్వతి - అదే ఓల్డ్ పూర్ణాహాలునుంచి వచ్చేజనం, బస్‌స్టాండ్, గంటస్తంభం ప్రాంతాలనుంచి వచ్చేజనం - ఆరోడ్డు కోలాహలంగా వుంది. వచ్చిపోయే జనం సర్కస్ డేరాలదగ్గర ఆగిమరీ వెళ్తున్నారు. సర్కస్ డేరాలముందు ఎత్తుగా బల్లలుకట్టి అక్కడ ఇద్దరు ముగ్గురమ్మాయిలు రికార్డు డాన్సు చేస్తున్నారు. ఒకపగటి వేషగాడు రకరకాల కబుర్లు చెబుతూ జనాన్ని ఆకర్షిస్తున్నాడు. డేరాలవెనుకనుంచి అప్పుడప్పుడు పులులూ సింహాలు చేస్తున్న గాండ్రింపులు వినబడుతున్నాయి.

హస్తసాముద్రికుడికి ఏమీ తోచడం లేదు. పదిపైసల బఠాణీలు కొనుక్కుని తింటున్నాడు, అతనికి దాదాపు అరవయ్యేళ్ళ వరకూ వుంటాయి. అతని పక్కనే ఒక పడుచుకుర్రాడు రెండు పేకేజీ డొక్కులమీద బఠాణీల జంగిడి, శనగల జంగిడి పెట్టి మరో డొక్కుమీద తాను కూచుని - " ఆ రండి బాబూ కాలక్షేపం బఠాణీలు- బఠాణీలు పసందైన శనగలు బాబూ శనగలు - రండి కొనండి తినండి" అంటూ అరుస్తున్నాడు ఆప్రక్కనే పకోడీలు , బజ్జీలు వేసే చక్రాలబండీ. అక్కడ కొంతమంది జనం వున్నారు. పకోడీలు,బజ్జీలు వేడివేడిగా కొనుక్కు పట్టుకుపోతున్నారు. హస్త సాముద్రికుడికి ఇవతలిపక్క వనమూలికల దుకాణం, ఆపక్క పీసుమితాయి వన మూలికల దుకాణం, ఆపక్క పీసుమితాయి కుర్రాడు ... ఇదీ వరస.

ప్రతి సాయంత్రం $4\frac{1}{2}$ తరువాత రాత్రి 7,8 వరకూ ఇద్దరు మినహా అంతా వుంటారు. వనమూలికలూ, హస్తసాముద్రికమూ దీపాలు పెడితే మాయం అవుతాయి.

హస్తసాముద్రికుడికి చాలావరకు పళ్లులేవు. ఉన్న పళ్ళతోనే బఠాణీలు నములుతూ, చప్పరిస్తూ, మింగుతూ నవ్వుకుంటున్నాడు. ఈ జీవితం ఎంత చిత్రమైనదీ అని ఆనవ్వు అర్థం, ఎన్ని కష్టాలు వచ్చినా ఎవ్వరూ జీవితాన్ని వొదులుకోరు గదా - బ్రతుకుతీపి అటువంటిది అనుకుని నవ్వుకున్నాడు. మళ్ళీతనలో తనే అలా నవ్వుకుని ఒక బఠాణీగింజ నోట్లోవేసుకొని నములుతున్నాడు.

"ఎందుకు నవ్వుతున్నావ్" అన్నాడొక ముసలి తాత. అతను కర్రవూతంతో నడుస్తున్నాడు. వయస్సు డభ్భయ్యయిదు దాటొచ్చు. దగ్గుతున్నాడు. జ్యోతిష్కుడు తనను చూసే నవ్వుతున్నాడేమో ననుకున్నాడాతాత.

" ఈ చొక్కా మామనవడిది వెలసి పోయింది బుజందగ్గర కొంచెం చిరగిందనుకో. పెద్ద చిరుగు కాదులే. తొడుక్కో తాతా అని నాకు పారేశాడు. అవున్లే పువ్వుల చొక్కాకాదూ? - బాగాలేదా నాకు -" అనడుగుతూ ఆగేడు.

హస్తసాముద్రికుడు ఆతాత చొక్కాని గమనించనేలేదు. కళ్ళజోడుసవరించుకుంటూ - " లేదుబాబూ, దయచెయ్యండి దయచెయ్యండి" అన్నాడు మధ్యాహ్నం భోజనం చేసివచ్చినప్పటినుంచి ఇంతవరకూ టీనీళ్ళు తాగుదామనుకున్నా ఎవ్వరూ చెయ్యి చూపించుకోలేదు.

పువ్వుల చొక్కా తొడుక్కున్న తాత కూచున్నాడు. " నా చెయ్యి చూస్తావా" అని చెయ్యి చూపాడు. హస్తసాముద్రికుడు గబగబా భూతద్దం వేసి ఆచెయ్యి చూస్తున్నాడు.

" తమది రాజనిదానంలాంటి జాతకం బాబూ" అన్నాడు హ.సా.

తాతనవ్వాడు, ఆమాట పొగడ్తకోసం అన్నదేనని తాతకి తెలుసు, హ.సా.కీ తెలుసు."తమకి ఒక్కర్తేకూతురు.." అంటూ ప్రారంభించి చాలా చాలా విషయాలు చెప్పాడు. అందులో కొన్ని తప్పులున్నాయి కొన్ని నిజాలూ వున్నాయి. అన్నీ ఓపిగ్గా విని, చివరికి విసుగ్గా " అదంతా సరేగాని నేనింకా ఎన్నాళ్ళుబ్రతుకు తానో చెప్పావుకావు" అన్నాడు తాత.

" ఏమీ అనుకోనంటే చెప్పండిబాబూ - తమవయసు ఉజ్జాయింపుగా ఒక ఎనబయి వుంటుందనుకుంటానండి.

" నాలుగేళ్ళు ఎక్కువచెప్పావు. నాకిప్పుడు డబ్బయ్యారు నడుస్తోంది. వచ్చే వైశాఖంలో డబ్బయారునిండి డబ్బయ్యేడు వస్తుంది."

" చిత్తం - ఒక నాలుగేళ్ళు పొరబడ్డానండి-"

" ఇంకాఎన్నాళ్లుబ్రతికేదీ కరెక్టుగా చెప్పు -"

" ఆచెయ్యి ఇలా యిప్పించండి -" అని ఆ చేతిని మరోసారి విప్పార్చిచూసాడు.

తాత స్వగతంలో చాలా సంగతులు చెబుతున్నాడు

" ఏమిటో ఒక్కడికి జ్యోతిష్యం చెప్పడం సరిగ్గా చేతకాదు, నేను అరవయ్యేళ్ళకంటే ఎక్కువ కాలం బ్రతకనని నా చిన్నప్పుడే ఒక గొప్ప సిద్ధాంతి చెప్పాడు అది పచ్చి అబద్ధం అయి పోయింది. అరవయ్యొకటోయేట మళ్ళీ మరో పెద్ద జ్యోతిష్కుడి చేత చూపించుకున్నాను. అతనిప్పుడు చచ్చిపోయాడనుకో- నేను డబ్బయ్యయిదేళ్ళు సుమారు బ్రతుకుతానని చెప్పాడు. మరి నాకిప్పుడు డబ్బయ్యేనిమిది నూరేళ్ల బ్రతకకపోవచ్చు గానీ కనీసం యెనభయి ఆరేళ్ల బ్రతికితేచాలు, సహస్రమాస జీవిగా తనువు చాలిస్తే ధన్యుణ్ణే. మా ముత్తాత నూట పది సంవత్సరాలు జీవించాడట. మాతాత తొంభయ్యేడేళ్ళు జీవించాడు, మానాన్న కూడా తొంభైరెండేళ్ళు బ్రతికాడు నాకంత దురాశ లేదుగాని" అని దగ్గడం ప్రారంభించాడు. చాలా పెద్ద దగ్గుతెర వచ్చింది. పెను గాలిలో కొబ్బరి చెట్టులా ఊగిపోయాడు. ఆ దగ్గు అంతకంతకూ ఎక్కువయి ముఖం ఎర్రబడి పోయింది. కళ్ళల్లోనీరు నిండిపోయింది. మన జ్యోతిష్కుడికి ఆ వాలకం చూసి చచ్చేభయం వేసింది కొంపముంచి ఇలా దగ్గుతూ దగ్గుతూ ఇక్కడేగాని కునికేసేడంటే నానా అల్లరి వడిపోవలసివస్తుంది పోలీసులతో. అనుకుని ప్రాణాలు ఉగ్గపట్టుకుని మనసులోనే పంచాక్షరి మననం చేసుకున్నాడు. క్రమంగా దగ్గుతెర తగ్గింది. ఆ తాత తమాయించుకుని నిటారుగా లేచి నిలబడ్డాడు.

"ఆ ఏంచెబుతున్నానూ?- ఈ మాయదారి దగ్గు నన్ను చంపేస్తోంది. ఆఖరికి ఈ దగ్గుకోసం చుట్టలు కూడా మానుకున్నాను, ఏమిటి అలా చూస్తున్నావు - ఈ దగ్గుచూసి ఇక్కడే ప్రాణం పోతుందనుకున్నావా? వెర్రివాడా ఇంతలోనే పోతుందా ప్రాణం?" అంటూ మళ్ళీ కూచున్నాడు.

" నాడెబ్భయ్యోయేట చాలా జబ్బుచేసింది. ఒకాయన నీలాగే చెయ్యిచూసి అది చాలా గండం సమయమని చెప్పాడు. ప్రాణాపాయం తప్పదన్నాడు. వాడలా చెప్పిన వారంరోజులు గడిచేసరికి నాజబ్బునయమైపోయి హాయిగా తిరగడం ప్రారంభించాను. ఆ మర్నాడు మా ఆవిడ చచ్చిపోయింది. నాజాతకంలో దుష్టగ్రహాల ప్రభావం వుందనీ- అది నన్ను వొదిలిపెట్టి మా ఆవిడను తీసుకుపోయిందని అన్నాడు. యేడిశాసారు వెధవలు. నువ్వు ఏమీ అనుకోకుగానీ ఒక్కమాట చెప్పేదా ? ఈ జ్యోతిష్కులు వుత్తి దొంగవెధవలనుకో, పచ్చి అబద్ధాలకోరులు. జరిగితే తమప్రభావం అంటారు" అని మళ్ళీ దగ్గి జేబులోంచి చుట్టపైకితీశాడు.

" నీదగ్గర అగ్గిపెట్టుంటే ఓసారిలా యియ్యి-" అని చుట్ట నోట్లో పెట్టి దాన్ని వాటంగా నమిలి కొసకొరికి - అగ్గిపెట్టి పుచ్చుకొని ముట్టించి గట్టిగా పొగపీల్చాడు.

"బాబు యిది లంకపొగాకేటి బాబూ" అన్నాడు హ.సా. నోరూరి పోయేల్లా చుట్టవేపు కన్నార్పకుండా చూస్తూనూ. —

"ఇలాంటి పొగాకుయీవూర్లో దొరకదోయ్. మామేనల్లుడు మొన్న కాకినాడ నుంచి వస్తేనూ రహస్యంగా తెప్పించుకొని దాచుకున్నాను.-" ఇటు వంటిది దొరికితే మానలేకపోతున్నాను."

" చిత్తం చాలా బావుందండి చుట్ట. ఇలాంటి చుట్ట ఒక్కటి కాలుస్తేచాలు బాబూ, కడుపు నిండిపోద్ది'

తాత సంగతి గ్రహించి చుట్టతీసిచ్చి - " యిందా వెలిగించు-" అన్నాడు, హస్త సాముద్రికుడి ముఖం సంతోషంతో చేటంతయ్యింది.

మళ్ళీ మరోసారి చెయ్యిచూసి" తమకొక కొడుకుండాలి బాబయ్యా-" అనడిగాడు హ.సా.

"వాడేబ్రతికివుంటే నాకెందుకీ కష్టాలు, ఈనాటికి దాదాపు నలభయ్యేళ్లవాడయుండేవాడు. ఎనిమిదేళ్లబ్రతికి గోదావరి పుష్కరాల్లో చచ్చిపోయాడు, అదేంరోగమో యిప్పటికీ నేనెక్కడా చూడలేదు ఇరవయినాలుగ్గంటల్లో ఎత్తుకెళ్ళి పోయింది- ఎలావుండేవాడనుకున్నావు. చెబితే నీకబద్ధంనాకు నిజమూనూ -పనసపండులా వుండేవాడు-"

తాత కళ్లల్లో తడిజీరలు కొంచెం దగ్గు మళ్లీ పైమీదున్న తువ్వాలుతో ముకంతుడుచుకున్నాడు. లేచి నుంచున్నాడు, కొంచెంసేపు గంభీరమౌనం - వేదాంతిలా చుట్టకాలుస్తున్నాడు. హస్తసాముద్రికుడు కూడా అయోమయంగా లేచి నుంచున్నాడు.

" ఇంతకీ నేనింకా ఎంతకాలం బ్రతుకుతానో చెప్పావుకావు"

" తమరిది సంపూర్ణాయుర్దాయం బాబయ్యా - నిండా నూరేళ్లు జీవిస్తారు. తమరు-" అన్నాడు హ.సా.

చుట్ట వాటంగా నోట్లో తిప్పుతూ ఒక మూలకి తెచ్చి-అదొక సొగసుగా పొగ వదిలాడు. యేదో చెప్పబోయి దగ్గులో చిక్కుకుపోయాడు. ఒకటే దగ్గు ఒకటే దగ్గు-తూలిపోయి మరి దగ్గలేక నేల మీద చతికిలబడిపోయాడు. అయినా ఆగలేదు దగ్గు. హస్తసాముద్రికుడికి కరచరణాలు ఆడటం లేదు. దానంతటదే తగ్గింది. మొహం పై కెత్తి చూశాడు తాత.

నేను నూరేళ్లు బ్రతుకుతానా - సరేలే సరేలే - యిదిగో - యీ డబ్బులుంచుకో- అని రూపాయికాసు యిచ్చి-కర్ర కొట్టుకుంటూ ముందుకు కదిలాడు తాత.

అలా మ్రాన్పడి నుంచుండిపోయాడు హస్తసాముద్రడు. తనకంటె ఆతాత కనీసం పద్దేనిమిదేళ్లు పెద్దవాడు. ప్రాణాంతకమైనదగ్గుతో తీసుకుంటున్నాడు. భార్యలేదు, కొడుకు లేడు, ఆధారం ఏమిటో తెలీసాదు. మనమడున్నాడంటున్నాడు-ఇంకెన్నాళ్లు బ్రతికేదీ వివరంగా కావాలి. తనెందుకు విరక్తి పడిపోవాలి- తనకేజబ్బులేదు. తనకూ నా అన్నవాళ్ళులేరు పాతికేళ్లకొడుకును ఉక్కుఫ్యాక్టరీ ఉద్యమం పొట్టనబెట్టేసుకుంది. ఆతరువాత వచ్చిన ఉప్పెనలో పెళ్లామూ, కూతురూ కొట్టుకుపోయారు. ఉన్న ఒక్కపూరికొంపా గంగపాలయిపోయింది, మరింకేం మిగిలింది. వున్నవూళ్లోవుండడానికి మనస్కరించక యిలా వచ్చేశాడు. ఏపనీరాదు. రానివిద్య నటిస్తూ పొట్టగడుపుకుంటున్నాడు. ఆకాశమే కప్పు, భూదేవే పక్క, చుక్కలుచుట్టాలు- బ్రతుకుమీద తీపి ఎంతబలమైంది కాకపోతే.

సంధ్య చిక్కబడింది, చీకటి చుట్టుకొచ్చేస్తోంది. దీపాలు వెలిగాయి. పకోడీలవాడికి బేరం ఊపిరి సలపడం లేదు. సర్కస్ మొదటాటమొదలు పెట్టేశారు. అట్టా గోనె సర్దీసి- రూపాయి పట్టుకొని కదిలాడు హస్తసాముద్రికుడు.

*రచన : 1979,*

*ప్రచురణ : స్రవంతి, మే 1980.*